దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

బుధవారం 20 08 2025

సంపుటి 1 సంచిక 112

పేజీలు : 02

UDYAM / TS-09-0148996

చరిత్రలో ఈ రోజు



1828: బ్రహ్మ సమాజ స్థాపన

1917: భారత రాజ్య కార్యదర్శి ఎడ్విన్ శామ్యూల్ మోంటాగుచే 1917 ఆగస్టు డిక్లరేషన్.

1931: ప్రముఖ తెలుగు సినిమా హాస్యనటుడు బి. పద్మనాభం జననం (మ.2010).

1944: భారతదేశ ఆరవ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జననం (చిత్రంలో)

1946: భారతదేశానికి చెందిన పారిశ్రామిక వేత్త, ఇన్ఫోసిస్ వ్యస్థాపకుడు నారాయణమూర్తి జననం.

1974: అమెరికా నటి, గాయకురాలు అమీ లౌ ఆడమ్స్ జననం.

1977: వోయెజర్ 2 ఒక మానవరహిత అంతర్ గ్రహ అంతరిక్షనౌకను నాసా ప్రవేశపెట్టింది.

2012: ప్రముఖ చిత్రకారుడు కాపు రాజయ్య మరణం (జ.1925).

కేసీఆర్ జీవోనే బీసీ రిజర్వేషన్లకు అడ్డంకి: సీఎం

దశ, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వలే కపోతున్నామని రేవంత్ రెడ్డి అంటున్నారు. కేసీఆర్ చేసిన పంచాయితీ రాజ్ చట్టంలో రిజర్వేషన్లు అన్నీ 50శాతం లోపే ఉండాలని ఉందన్నారు. ఆ చట్టమే ఇప్పుడు బీసీలకు 42% రిజర్వేషన్లు అందకుండా అడ్డంకిగా మారిందని సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ శంకుస్థాపన సభలో ఆయన మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్ల అంశంలో కేసీఆర్ చేసిన తప్పిదం వల్లే సమస్యలు వచ్చాయని తేల్చారు. రేవంత్ రెడ్డి ఈ మాట చెప్పడం ఇదే మొదటి సారి కాదు. అసెంబ్లీలోనూ చెప్పారు. ఢిల్లీ ధర్నాలోనూ చెప్పారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించినప్పుడు కోర్టు ఆదేశాల ప్రకారం రిజర్వేషన్లను సుప్రీం తీర్పు ప్రకారం 50 శాతానికి పరిమితం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. అంతకు ముందే ఉమ్మడి రాష్ట్రంలో సుప్రీంకోర్టు ప్రత్యేక అనుమతితో బీసీలకు ఎక్కువ రిజర్వేషన్లు ఇచ్చి స్థానిక ఎన్నికలు నిర్వహించారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు.. యాభై శాతం లోపే రిజర్వేషన్లను ఖరారు చేయాలని ఆదేశించింది. దాంతో కేసీఆర్‌కూ తప్పలేదు.

అయినా బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. పార్టీ తరపున కామారెడ్డి డిక్లరేషన్ రిలీజ్ చేశారు. ఇప్పుడు కేంద్రం అంగీకరించకపోవడంతో .. అమలు చేయలేకపోతున్నారు. సెప్టెంబర్ నెలాఖరుకు.. స్థానిక ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ రిజర్వేషన్ల అంశంపై ఏం చేద్దామన్నదానిపై రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకోలేకపోయింది.

భారీగా తగ్గనున్న మెడికల్ కేర్ ప్రొడక్ట్స్..

దీపావళి నాటికి అమలులోకి.. కంపెన్సేషన్ సెస్‌ను 40% ఏకరీతి రేటుగా మార్చాలని ప్రతిపాదన..

దశ, ముంబై: భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట పై జాతీయ పతాకం ఆవిష్కరించిన ప్రధాని నరేంద్ర మోదీ.. భారత ప్రజలకు ఒక హామీ ఇచ్చారు. దీపావళికి డబుల్ ధామాకా ఇస్తామని ప్రకటించారు. జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) విధానంలో కీలక సంస్కరణలను ఈ దీపావళి నాటికి అమలు చేస్తామని తెలిపారు. ఈ మార్పుల ద్వారా రోజువారీ వినియోగ వస్తువుల ధరలు తగ్గనున్నాయని, ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే విధంగా జీఎస్టీ వ్యవస్థ సరళీకరణ జరుగుతుందని మోదీ సూచించారు.ప్రధానమంత్రి మోదీ ప్రకటన ప్రకారం, జీఎస్టీ విధానంలో "తదుపరి తరం సంస్కరణలు" (జీఎస్టీ 2.0) ఈ దీపావళి నాటికి అమలులోకి వస్తాయి.

ప్రస్తుత జీఎస్టీ నిర్మాణంలో ఐదు పన్ను స్లాబ్‌లు (0%, 5%, 12%, 18%, 28%), విలాసవంతమైన, హానికర వస్తువులపై అదనపు సెస్ ఉన్నాయి. సంస్కరణలతో స్లాబ్‌లు సరళీకరించనున్నారు. దీంతో ప్రస్తుత 12% స్లాబ్‌ను రద్దు చేసి, ఈ స్లాబ్‌లోని వస్తువులను 5% లేదా 18% స్లాబ్‌లకు బదిలీ చేయాలనే ప్రతిపాదన ఉంది. దీనివల్ల జీఎస్టీ నిర్మాణం సరళమవుతుంది. రోజువారీ వినియోగ వస్తువులు, గృహోపకరణాలు, ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులపై జీఎస్టీ రేట్లను తగ్గనున్నాయి. 28% స్లాబ్‌లోని వస్తువులలో 90% వస్తువులు 18% స్లాబ్‌కు, 12% స్లాబ్‌లోని 99% వస్తువులు 5% స్లాబ్‌కు మారే అవకాశం ఉంది. విలాసవంతమైన మరియు హానికర వస్తువులపై విధించే కంపెన్సేషన్ సెస్‌ను 40% ఏకరీతి రేటుగా మార్చాలని ప్రతిపాదన. ఇది ప్రస్తుత సెస్ రేట్లను (1% నుంచి 290% వరకు) సరళీకరిస్తుంది. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ సమస్యలను పరిష్కరించడానికి ఇన్‌వర్టెడ్ డ్యూటీ నిర్మాణాన్ని సరిచేయడం, రిఫండ్ ప్రక్రియలను సరళీకరించడం లక్ష్యంగా ఉంది.ప్రధానమంత్రి మోదీ స్పష్టమైన వస్తువుల జాబితాను పేర్కొనకపోయినప్పటికీ, నిపుణుల అంచనాల ప్రకారం.. కొన్ని రోజువారీ వినియోగ వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉంది. రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లు, ఇతర గృహ వినియోగ ఉత్పత్తులపై 28% నుంచి 18%కి జీఎస్టీ తగ్గవచ్చు. ఫ్రూట్ జ్యూస్‌లు, బటర్, చీజ్, కండెన్స్‌డ్ మిల్క్, డ్రై ఫ్రూట్స్, సాసేజ్‌ల వంటి ఉత్పత్తులు 12% లేదా 28% నుంచి 5% లేదా 18% స్లాబ్‌కు మారవచ్చు. మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్, గాజ్, బ్యాండేజ్‌లు, డయాగ్నస్టిక్ కిట్‌ల వంటి ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గే అవకాశం ఉంది. ఆరోగ్య, జీవన బీమా ప్రీమియంలపై ప్రస్తుత 18% జీఎస్టీని 12% లేదా 5%కి తగ్గించాలని చర్చలు జరుగుతున్నాయి, దీనివల్ల బీమా సేవలు మరింత అందుబాటులోకి వస్తాయి. 10 రూపాయల లోపు ధర ఉన్న ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులు (షాంపూ, సబ్బు వంటి చిన్న సాచెట్‌లు) 5% స్లాబ్‌లోకి వచ్చే అవకాశం ఉంది.జీఎస్టీ సంస్కరణలు ఆర్థిక వృద్ధి, సామాన్య ప్రజల జీవన నాణ్యతపై గణనీయమైన ప్రభావం చూపనున్నాయి. అయితే పన్ను రేట్ల తగ్గింపు వల్ల ప్రభుత్వ ఆదాయంలో సుమారు 0.15% జీడీపీ నష్టం (500 బిలియన్ రూపాయలు) జరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రోజువారీ వస్తువుల ధరల తగ్గింపు మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది. సెస్ రద్దు, రేట్ల సరళీకరణ ద్వారా దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుంది.

ఇందిరమ్మ బిల్లు మంజూరుకు డబ్బులు వసూలు

జాన్ పహాడ్ పంచాయతీ పంచాయతీ కార్యదర్శిపై వేటు

దశ, సూర్యాపేట: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేసే సమయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్న పంచాయతీ కార్యదర్శిపై జిల్లా కలెక్టర్ తేజస్నంద లాల్ పవర్ సస్పెండ్ వెయిట్ వేశారు. పాలకీడు మండలం, జాన్ పహాడ్ పంచాయతీ కార్యదర్శి యంజమూరి వెంకయ్య బిల్లుల మంజూరు విషయంలో లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేసిన విషయంపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సీరియస్ గా తీసుకున్నారు. తక్షణమే విషయంపై విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు జిల్లా కలెక్టర్. జాన్ పహాడ్ పంచాయతీ కార్యదర్శి యంజమూరి వెంకయ్యను తక్షణమే జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి అటాచ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జాన్ పహాడ్ గ్రామానికి 157 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా.. ఇండ్ల బిల్లులు చేసేందుకు పంచాయతీ కార్యదర్శి వెంకయ్య ఒక్కో లబ్ధిదారు దగ్గర 20వేల నుంచి 30 వేలు డిమాండ్ చేసినట్లు విచారణలో వెల్లడయింది. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుండి డబ్బులు డిమాండ్ చేస్తే సహించేది లేదనీ.. ఎంతటి వారినైనా వదిలిపెట్టమని కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ హెచ్చరించారు.

విపక్ష పార్టీల ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా బి.సుదర్శన్ రెడ్డి



దశ, న్యూఢిల్లీ: తమ ఉప రాష్ట్రపతి అభ్యర్థిని విపక్ష పార్టీలు ప్రకటించాయి. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని తమ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేశాయి. జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకులమైలారం. 1971లో ఉస్మానియా వర్సిటీలో బి.సుదర్శన్ రెడ్డి లా చదివారు. 2007 11 మధ్య ఆయన సుప్రీం కోర్టు జడ్జిగా పని చేశారు. గోవా తొలి లోకాయుక్తగా ఆయన సేవలందించారు. 2005లో గువాహటి హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పని చేశారు. ఇప్పటికే ఎన్డిఎ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సి.పి. రాధాకృష్ణన్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రాధాకృష్ణన్, సుదర్శన్ రెడ్డిల మధ్య ఉప రాష్ట్రపతి పదవి కోసం సెప్టెంబర్ 9న పోటీ జరగనుంది.

రోడ్ల కనెక్టివిటీతోనే గ్రామాలకు పరిశ్రమలు

క్యాపిటల్& ఇన్వెస్ట్మెంట్స్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రి కోమటి రెడ్డి

దశ, హైదరాబాద్: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం నాడు క్యాపిటల్& ఇన్వెస్ట్మెంట్స్ సబ్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర సచివాలయం 6వ ఫ్లోర్ లో సమావేశం జరిగింది. డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి,ఉత్తమ్ కుమార్ రెడ్డి శ్రీధర్ బాబు,సీతక్క తదితరులు హాజరయ్యారు. చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు,అన్ని శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు,పలువురు అధికారులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఇన్ఫ్రాస్ట్రక్చర్ & క్యాపిటల్ వర్క్స్ సబ్ కమిటీ ఏర్పాటు చేసుకున్నది పనుల పురోగతి కోసం. రాష్ట్ర ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ శాఖలు నిత్యం ప్రజలకు కనెక్ట్ అయి ఉండే శాఖలు, రాష్ట్ర రాజధాని నుండి జిల్లా కేంద్రాలు,మండల కేంద్రాలకు మంచి రోడ్ల కనెక్టివిటీ ఉంటే గ్రామీణ ప్రాంతాలకు కూడా ఇండస్ట్రీస్ వెళ్తాయని అన్నారు.

విగ్రహాల తరలింపులో విషాదాలు

కరెంట్ షాక్ తగిలి ఇద్దరు వ్యక్తులు మృతి ..

దశ, హైదరాబాద్: హైదరాబాద్ పాతబస్తీలోని బండ్లగూడ ప్రాంతంలో గణేష్ విగ్రహాన్ని తరలించే సమయంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ట్రాలీపై విగ్రహాన్ని తీసుకెళ్తున్న సమయంలో విద్యుత్ తీగలను కర్రతో పైకి లేపే ప్రయత్నంలో కరెంట్ షాక్ తగిలి ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో వ్యక్తి గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదే తరహాలో అంబర్‌పేట్ ప్రాంతంలో కూడా విషాద ఘటన నమోదైంది. రామ్ చరణ్ అనే యువకుడు గణేష్ విగ్రహాన్ని తరలిస్తూ విద్యుత్ తీగలను తొలగించబోతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.కేవలం రెండు రోజుల వ్యవధిలో హైదరాబాద్ నగరంలో మూడు విద్యుత్ ప్రమాదాలు జరిగి 9 మంది చనిపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత ఆదివారం రాత్రి రామంతాపూర్‌లో కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా విద్యుదాఘాతానికి గురై ఆరుగురు ప్రాణాలు కోల్పోయిన విషయం ఇంకా మరువకముందే, ఇవే రకం మరిన్ని ఘటనలు చోటు చేసుకోవడం భయానకంగా మారింది. ఈ నేపథ్యంలో విగ్రహాల తరలింపు సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరాన్ని అధికారులు తీవ్రంగా గుర్తుచేస్తున్నారు. విద్యుత్ తీగలు, హైటెన్షన్ లైన్‌ల సమీపంలో విగ్రహాలు లేదా భారీ వస్తువులు తరలించే ముందు విద్యుత్ శాఖ సహాయాన్ని తీసుకోవాలని సూచిస్తున్నారు.రామంతాపూర్ ప్రమాదంపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ప్రకటించగా, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వ సహాయం ఎల్లప్పుడూ కుటుంబాలకు అండగా నిలుస్తుందని వారికి భరోసా ఇచ్చారు.

వారం క్రితం పెళ్లి.. అంతలోనే షాక్ గురై తండ్రీకొడుకులు మృతి

దశ, మెదక్: అయిదు రోజుల క్రితమే ఆ కుటుంబసభ్యులంతా వైభవంగా తమ ఇంటి బిడ్డ వివాహం జరిపించారు. కానీ అంతలోనే పెను విషాదం వాళ్ల సంతోషాన్ని చిదిమేసింది. మొక్కజొన్న చేనును అడవి పందుల బారి నుంచి కాపాడుకునేందుకు యత్నించిన తండ్రీ కొడుకు ఇద్దరూ తనువు చాలించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగాపూర్గ్రామంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన మూర్తి గజేందర్రెడ్డి -పద్మ దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు రాజిరెడ్డి. కూతురు సంతోషి. రాజిరెడ్డి తన తండ్రి గజేందర్ రెడ్డితో కలిసి మొక్కజొన్న చేను వద్దకు వెళ్లాడు.మొక్కజొన్న పంటను అడవిపందుల బెడద నుంచి రక్షించుకునేందుకు ఇద్దరూ కలిసి విద్యుత్ తీగ అమర్చే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది.. మొక్కజొన్న చేను చుట్టూ విద్యుత్కంచె వేసి డ్యూటీకి వెళ్లాలని అనుకున్నాడు రాజిరెడ్డి(25). తండ్రి గజేందర్ రెడ్డి (52)తో కలిసి తీగ అమర్చడం మొదలుపెట్టాడు. అంతా పూర్తయే సమయంలో తీగను సరిచేద్దామని ఒక్కసారి వారిద్దరూ కలిసి బలంగా లాగారు. దీంతో ఆ తీగ వెళ్లి ట్రాన్స్ ఫార్మర్‌కు తగిలింది. దీంతో షాక్ గురై తండ్రీకొడుకులు అక్కడికక్కడే కుప్పకూలారు.

ఉత్తమ ఫోటోగ్రాఫర్‌గా మడూరి బ్రహ్మచారికి మొదటి బహుమతి

దశ సూర్యాపేట ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఫోటో గ్రాఫర్ గా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఫోటో గ్రాఫర్ మడూరి బ్రహ్మచారి రాష్ట్రంలో మొదటి బహుమతి అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పౌర సంబంధాల శాఖ హైద్రాబాద్ వారు ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన నాల్గవ కేటగిరీ రాజీవ్ యువ వికాసం విభాగంలో రాష్ట్రంలో మొదటి బహుమతికి ఎంపికయ్యారు. మంగళవారం హైద్రాబాద్ గ్రీన్ పార్కు హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ కమీషనర్ సీహెచ్ ప్రియాంకల చేతుల మీదుగా నగదు పురస్కారంతో పాటు శాలువ, షీల్డ్, ప్రసంసా పత్రంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.